

కెరటం నా ఆదర్శం
లేచి పడుతున్నందుకు కాదు,
పడినా లేస్తున్నందుకు...


Dr.PRK
# పవర్
పోరాడితే పోయేదేమీ లేదు బానిస సంకెళ్ళు తప్ప



రామకృష్ణ హాస్పిటల్స్
పక్షవాతం, డిస్క్ సమస్యలు,
నడుమునొప్పి
మెడ నొప్పులకు
పూర్తి చికిత్స కలదు.
నిరుపేదలకు ఉచిత వైద్యం



రామకృష్ణ చారిటబుల్ ట్రస్ట్
విజయ టాకీస్ దగ్గర, హనుమాన్ టెంపుల్ లైన్, హనుమకొండ
సెల్: 9849485100



సంపుటి : 01 సంచిక : 354 | శుక్రవారం 2 అక్టోబర్ 2026 | పేజీలు : 4 | వెల : 4


# యువత ఆకాంక్షలకు ప్రతీక యూపీఎస్సీ

## ప్రతి ఉద్యోగి పేదల ఆవేదనను అర్థం చేసుకోవాలి

## సిటిజన్ ఫస్ట్ అనేది సివిల్ సర్వీస్ ఉద్యోగుల లక్ష్యం

## ఢిల్లీలో యూపీఎస్సీ శతాబ్ది ఉత్సవాల్లో ప్రధాని మోదీ

## స్మారక నాణెం, పోస్టల్ స్టాంప్‌ను ఆవిష్కరించిన ప్రధాని



**న్యూఢిల్లీ, పవర్ న్యూస్**

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) వందేళ్ల ప్రస్థానం లక్షలాది మంది యువత ఆకాంక్షలకు, దేశ ప్రజల నమ్మకానికి ప్రతీక అని ప్రధాని నరేంద్ర మోదీ కొనియాడారు. గురువారం ఢిల్లీలోని భారత్ మండపంలో జరిగిన యూపీఎస్సీ శతాబ్ది ఉత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూపీఎస్సీ శతాబ్ది స్మారక నాణెం, పోస్టల్ స్టాంప్‌తో పాటు '100 ల్యాండ్‌మార్క్ జడ్జిమెంట్స్' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాని మోదీ మాట్లాడుతూ.. నిన్న జరిగిన ఒక విమాన ప్రమాద ఘటనలో అసాధారణ ధైర్య సాహసాలు ప్రదర్శించిన భారత పైలట్, కెప్టెన్ స్మిత్ మచ్చర్‌ను ప్రత్యేకంగా అభినందించారు. "నిన్న జరిగిన ఘటనలో భారత పైలట్ కెప్టెన్ స్మిత్ చూపిన ధైర్యం, సమయస్ఫూర్తి, నిబద్ధత ప్రశంసనీయం. ఇజ్రాయెల్ ప్రధాని చెప్పినట్లుగా, 9/11 తరహా ఘోర విషాదాన్ని ఒక భారతీయుడు అడ్డుకున్నాడు" అని మోదీ అన్నారు. స్మిత్ ఘనత మనందరికీ గర్వకారణమని, తాను ఆయన కుటుంబ సభ్యులతో మాట్లాడానని తెలిపారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్న స్మిత్ సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని దేశ ప్రజలందరూ ప్రార్థించాలని పిలుపునిచ్చారు. యూపీఎస్సీ వందేళ్ల ప్రస్థానంపై మోదీ మాట్లాడుతూ.. "ఇది కేవలం ఒక సంస్థ వందేళ్లు పూర్తి చేసుకోవడం కాదు, ఇది లక్షలాది యువత ఆశయాల వేడుక. ప్రతి భారతీయుడు ఈ సంస్థపై ఉంచిన అచంచల విశ్వాసానికి ఇది నిలువుటద్దం. ఈ సంస్థను ఉన్నత శిఖరాలకు చేర్చిన ప్రతి ఒక్కరికీ నా అభినందనలు" అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సివిల్ సర్వీసుల చరిత్రను, మహనీయుల సేవలను మోదీ గుర్తుచేసుకున్నారు. "1920లో నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఈ పరీక్షలో ఉత్తీర్ణులయ్యారు. ఆనాడు బ్రిటిష్ పాలన ఉన్నప్పటికీ ఆయన సంస్కృతంలో పేపర్ రాశారని ఇక్కడి గ్యాలరీలో చూశాను. అదేవిధంగా, దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశాన్ని నడపడంలో సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ కీలక పాత్ర పోషించారు. స్వతంత్ర భారతానికి అవసరమైన 'ఉక్కు చట్రాన్ని' (స్టీల్ ఫ్రేమ్) సర్దార్ పటేల్ అందించారు. ఈ సంస్థను దేశానికి ఒక ప్రధాన స్తంభంగా తీర్చిదిద్దారు" అని మోదీ వివరించారు. 1926 అక్టోబర్ 1న పబ్లిక్ సర్వీస్ కమిషన్‌గా ప్రారంభమైన ఈ సంస్థ, శతాబ్ద కాలంలో ఎన్నో మార్పులకు లోనై స్వతంత్ర రాజ్యాంగబద్ధ సంస్థగా రూపుదిద్దుకుందని ప్రధాని గుర్తుచేశారు. గతేడాది అక్టోబర్ 1న ప్రారంభమైన శతాబ్ది ఉత్సవాలు ఈ కార్యక్రమంతో ముగిశాయి. సెప్టెంబర్ 30, అక్టోబర్ 1 తేదీల్లో రెండు రోజుల పాటు జరిగిన ఈ వేడుకల్లో వివిధ రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమిషన్ల చైర్మన్లు, సభ్యులు, కేంద్ర ప్రభుత్వ సీనియర్ అధికారులు, విద్యావేత్తలు, యూపీఎస్సీ అధికారులు పాల్గొన్నారు.

## చరిత్రకు జీవం: నిజాంలు నీళ్లు తాగిన బావికి హైడ్రా పునరుజ్జీవం



**హైదరాబాద్, పవర్ న్యూస్**

హైదరాబాద్ నగరం అంటే కేవలం కాంక్రీట్ జంగిల్ కాదు, అడుగడుగునా చారిత్రక వైభవానికి, సాంస్కృతిక వారసత్వానికి నిలువుటద్దం. ముఖ్యంగా పాతబస్తీ గల్లీల్లో తిరిగితే శతాబ్దాల నాటి కథలు మనల్ని పలకరిస్తాయి. అలాంటి ఓ అద్భుతమైన చారిత్రక కట్టడానికి ఇప్పుడు పునరుజ్జీవం లభిస్తోంది. శివరాంపల్లిలోని 356 ఏళ్ల నాటి బుమ్-రుక్న్-ఉద్-దౌలా చెరువును ఇటీవలే పునరుద్ధరించి నగరానికి ఓ మణిహారంగా అందించిన 'హైడ్రా', ఇప్పుడు అదే చెరువు కింద ఉన్న ఓ పురాతన ఊట బావికి ప్రాణం పోస్తోంది. నిజాం నవాబులు సైతం ఔషధ గుణాలున్నాయని భావించి ఈ బావి నీరు తాగినట్టు చరిత్ర చెబుతోంది. అంతటి విశిష్టత కలిగిన ఈ బావి, కాలగర్భంలో కలిసిపోతున్న తరుణంలో హైడ్రా దీని పునరుద్ధరణకు శ్రీకారం చుట్టింది.

**సీఎం ఆదేశాలతో వేగంగా అడుగులు**

గత మార్చి 8వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుమ్-రుక్న్-ఉద్-దౌలా చెరువును ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు. ఆ సమయంలోనే చెరువుకు ఆనుకుని ఉన్న ఈ చారిత్రక బావి ప్రాముఖ్యతను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సీఎం దృష్టికి తీసుకెళ్లారు. దీని చారిత్రక నేపథ్యాన్ని తెలుసుకున్న ముఖ్యమంత్రి, తక్షణమే బావిని పునరుద్ధరించాలని ఆదేశించారు. దీంతో హైడ్రా అధికారులు రంగంలోకి దిగారు. చెరువు అభివృద్ధి పనులను విజయవంతంగా పర్యవేక్షించిన 'విమోస్ టెక్నోక్రాట్స్' సంస్థకే ఈ బావి పునర్నిర్మాణ బాధ్యతలను కూడా అప్పగించారు. ప్రస్తుతం పనులు శరవేగంగా జరుగుతుండగా, మరో రెండు, మూడు నెలల్లో ఈ బావి పూర్వ వైభవాన్ని సంతరించుకోనుంది.

# పేదల ఆపద్బాంధవుడు డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ



## రెండు దశాబ్దాల నిస్వార్థ సేవా ప్రస్థానం

**(హనుమకొండ - పవర్ దినపత్రిక, అక్టోబర్ 01**

సమాజంలో ఎంతోమంది వ్యాపార దృక్పథంతో వైద్య వృత్తిని కొనసాగిస్తుంటే, ప్రాణాపాయ స్థితిలో ఉన్న నిరుపేదలకు ప్రాణం పోస్తూ 'పేదల డాక్టర్'గా చెరగని ముద్ర వేసుకున్నారు ప్రముఖ న్యూరో ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ. విద్యార్థి దశ నుంచే సామాజిక స్పృహతో అడుగులు వేసిన ఆయన, గత రెండు దశాబ్దాలుగా వైద్య మరియు సామాజిక రంగాలలో అందిస్తున్న సేవలు ఎందరికో స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయి.

**అంతర్జాతీయ విద్య -- ఉన్నత విలువలు:**

డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ సాధారణ కుటుంబం నుంచి వచ్చి తన ప్రతిభతో అత్యున్నత విద్యను అభ్యసించారు. బీపీటీ, ఎంపీటీ, ఎంఎస్ (సైకాలజీ) పూర్తి చేయడమే కాకుండా, అంతర్జాతీయ స్థాయిలో లండన్ నుంచి సీసీటీ (గాశీఅంశీఅ జజు) అర్హత సాధించి వైద్య రంగంలో ప్రత్యేక గుర్తింపు పొందారు. పక్షవాతం, నడుము నొప్పి, మెడ నొప్పి మరియు నరాల సంబంధిత సమస్యలతో బాధపడే రోగులకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించడంలో ఆయన సిద్ధహస్తులు.

**రామకృష్ణ హాస్పిటల్ -- నిరుపేదలకు భరోసా:**

హనుమకొండలోని విజయ టాకీస్ దగ్గర, హనుమాన్ టెంపుల్ లేన్, హెల్ప్‌లైన్ హాస్పిటల్ ఎదురుగా 'రామకృష్ణ హాస్పిటల్'ను స్థాపించి ఆయన అంకితభావంతో సేవలు అందిస్తున్నారు. ముఖ్యంగా పక్షవాతంతో మంచాన పడిన పేదలకు ఆర్థిక భారం కాకుండా ఉచితంగా లేదా నామమాత్రపు రుసుముతో చికిత్స అందిస్తూ వారి కుటుంబాల్లో వెలుగు నింపుతున్నారు. అందుకే ఆ ప్రాంత ప్రజలు ఆయనను 'పేదల డాక్టర్' అని ప్రేమగా పిలుచుకుంటారు.

**రామకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అప్రతిహత సేవలు:**

కేవలం ఆసుపత్రికే పరిమితం కాకుండా 'రామకృష్ణ చారిటబుల్ ట్రస్ట్' ద్వారా గత 21 ఏళ్లుగా వేలాది మందికి ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అలాగే కాకతీయ మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ సొసైటీ (కే మ్యాక్స్) ద్వారా ఎంతోమంది నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తూ, పేద విద్యార్థుల చదువులకు ఆర్థిక సాయం చేస్తూ ఆపద్బాంధవుడిగా నిలిచారు.

**రాజకీయ మరియు సామాజిక రంగాల్లో విశేష కృషి**

ఎన్ఎస్‌యూఐ విద్యార్థి నాయకుడిగా ప్రజా సమస్యలపై పోరాటాలు ప్రారంభించిన ఆయన, గత రెండు దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేశారు. ప్రజా పోరాటాల్లో పాల్గొని పలుమార్లు పోలీసుల నిర్బంధాలను సైతం ఎదుర్కొన్నారు. 2017 నుంచి ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ (ఏఐపీసీ) సభ్యుడిగా, హనుమకొండ డీసీసీ ఎస్సీ విభాగం చైర్మన్‌గా పార్టీ బలోపేతానికి విశేషంగా కృషి చేశారు. వృత్తి ధర్మాన్ని నిర్వర్తిస్తూనే మరోవైపు నిస్వార్థంగా ప్రజాసేవ చేస్తున్న డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ లాంటి నాయకులు సమాజానికి ఎంతైనా అవసరమని మేధావులు, పట్టభద్రులు కొనియాడుతున్నారు.

# ఖైరతాబాద్ ఉపఎన్నిక... నోటిఫికేషన్ ఆపండి

## హైకోర్టుకు విజయారెడ్డి.. విచారణ వాయిదా

**హైదరాబాద్, పవర్ న్యూస్**

ఖైరతాబాద్ శాసనసభ నియోజకవర్గ ఉపఎన్నిక నోటిఫికేషన్ జారీ చేయకుండా భారత ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై విచారణను తెలంగాణ హైకోర్టు మంగళవారానికి వాయిదా వేసింది. దివంగత మాజీ మంత్రి పి. జనార్ధన్ రెడ్డి కుమార్తె విజయారెడ్డి ఈ మేరకు ఉన్నత న్యాయస్థానంలో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. విజయారెడ్డి తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ, 2024 ఎన్నికల్లో దానం నాగేందర్ విజయాన్ని సవాల్ చేస్తూ తమ క్లయింట్ దాఖలు చేసిన ఎలక్షన్ పిటిషన్ ఇంకా కోర్టులో పెండింగ్‌లో ఉందని గుర్తుచేశారు. ఆ ఎన్నికల



అఫిడవిట్‌లో దానం నాగేందర్ తప్పుడు సమాచారం ఇచ్చారని ఆయన ఆరోపించారు. ఈ పాత పిటిషన్‌పై తుది తీర్పు వెలువడే వరకు ఖైరతాబాద్ ఉపఎన్నికకు నోటిఫికేషన్ జారీ చేయకుండా నిలిపివేయాలని న్యాయస్థానాన్ని అభ్యర్థించారు. వాదనలు విన్న హైకోర్టు, ఈ పిటిషన్‌పై కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని ప్రతివాదులను ఆదేశించింది. అనంతరం తదుపరి విచారణను మంగళవారానికి వాయిదా వేస్తున్నట్లు వెల్లడించింది. కోర్టు తాజా నిర్ణయంతో ఖైరతాబాద్ ఉపఎన్నిక ప్రక్రియపై ప్రస్తుతానికి ఉత్కంఠ నెలకొంది.

# 92 లక్షల మందికి నోటీసులు

## తెలంగాణ ప్రధాన ఎన్నికల కమిషనర్

## 65 లక్షల మంది నోటీసులకు సమాధానం ఇచ్చారని వెల్లడి

## ఖైరతాబాద్ నియోజకవర్గంలో 80 వేల మందికి నోటీసులు ఇచ్చామన్న సుదర్శన్ రెడ్డి

## సర్ ప్రక్రియను పొడిగించే ఉద్దేశం లేదని స్పష్టీకరణ

**హైదరాబాద్, పవర్ న్యూస్**

తెలంగాణ రాష్ట్రంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)లో భాగంగా 92 లక్షల మందికి నోటీసులు ఇచ్చినట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ సుదర్శన్ రెడ్డి వెల్లడించారు. ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో 80 వేల మందికి నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. వారిలో 20 శాతం మంది సమాధానం ఇచ్చారని పేర్కొన్నారు. రాషంలోని 92 లకల మందిలో 65 లకల మంది




నోటీసులపై స్పందించినట్లు చెప్పారు. నోటీసులు అందిన వారి ఇళ్ల వద్దకు బీఎల్‌ఓలు వెళ్లి సంబంధిత పత్రాలను తీసుకుంటున్నారని పేర్కొన్నారు. నోటీసులు అందిన కుటుంబ సభ్యులు అందరూ అందుబాటులో ఉండవల్సిన అవసరం లేదని, ఒక్కరు ఉండి, మిగిలిన అందరి కుటుంబ సభ్యుల వివరాలు ఇస్తే సరిపోతుందని అన్నారు. సర్ ప్రక్రియను మరోసారి పొడిగించే ఉద్దేశం లేదని స్పష్టం చేశారు.

# డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ అవకాశం కల్పించాలి

**ప్రజాసంఘాల జేఏసీ చైర్మన్ మాదాసి సురేష్**

(ఆత్మకూరు -- పవర్ దినపత్రిక, అక్టోబర్ 01, 2026)



మాదిగ సామాజిక వర్గానికి గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ సీటు కేటాయించాలని ప్రజాసంఘాల జేఏసీ చైర్మన్ మాదాసి సురేష్ డిమాండ్ చేశారు. గురువారం ఆత్మకూరు మండలంలోని నాగయ్యపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీకి ఉన్న రెండు స్థానాల్లో కనీసం ఒక్క స్థానమైనా మాదిగలకు కేటాయిస్తారని ఆశించామని, అయితే ఆ అవకాశం రాలేదని ఆయన అన్నారు. ఈ నేపథ్యంలో గవర్నర్ కోటాలో మాదిగలకు ఎమ్మెల్సీ అవకాశం కల్పించాలని కోరారు. డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ విద్యావంతుడు, రాజకీయ అనుభవం కలిగిన నాయకుడు మరియు ప్రజాసేవ పట్ల అంకితభావంతో పనిచేస్తున్న వ్యక్తి అని తెలిపారు. తాతముత్తాతల నుంచి కాంగ్రెస్ పార్టీతో అనుబంధం ఉన్న కుటుంబానికి చెందిన రామకృష్ణ, దీర్ఘకాలంగా పార్టీలో పనిచేస్తూ ప్రజా సమస్యలపై పోరాడుతున్నారని పేర్కొన్నారు. వరంగల్, ఖమ్మం, నల్గొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణకు అవకాశం వస్తుందని భావించినప్పటికీ దక్కలేదన్నారు. ఇప్పుడు గవర్నర్ కోటాలో ఆయనకు ఎమ్మెల్సీ అవకాశం కల్పిస్తే వరంగల్ జిల్లా, తెలంగాణ రాష్ట్రంతో పాటు బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి మరింత విస్తృతంగా పనిచేస్తారని మాదాసి సురేష్ ఆశాభావం వ్యక్తం చేశారు. మాదిగల రాజకీయ ఆకాంక్షలను దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి మరియు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకత్వం ఈ అంశాన్ని సానుకూలంగా పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో దళిత బహుజన ఫ్రంట్ డీబీఎఫ్ జిల్లా కార్యదర్శి మాదాసి సుదర్శన్, ధర్మ సమాజ్ పార్టీ మండల అధ్యక్షుడు బాగాజీ రజనీకాంత్, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు మాదాసి ప్రభాకర్ మాదిగ, మాజీ ఉపసర్పంచ్ సంగి యాకయ్య, మాజీ వార్డు సభ్యులు మాదాసి అశోక్, బోడక్ల సాంబయ్య, ధర్మ సమాజ్ పార్టీ జిల్లా కార్యదర్శి డాక్టర్ సుధాకర్, ప్రజా సంఘాల నాయకులు గుండాల రాజలింగం, మాదాసి బిక్షపతి, మాదాసి సారయ్య, మాదాసి కట్టమ్మ తదితరులు పాల్గొన్నారు.



## పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల నమోదుపై బీజేపీ సన్నాహక సమావేశం

**డాక్టర్ కాళీ ప్రసాద్ రావు పిలుపు**

(హనుమకొండ -- పవర్ దినపత్రిక, అక్టోబర్ 01, 2026)

వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల నమోదు ప్రక్రియపై హనుమకొండ జిల్లా అధ్యక్షులు కొలను సంతోష్ రెడ్డి ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, పరకాల నియోజకవర్గం కాంటెస్టెడ్ ఎమ్మెల్యే డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్ రావు పాల్గొని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ అంజిరెడ్డి మరియు జిల్లా ఇన్‌చార్జి, మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ హాజరై శ్రేణులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్ రావు మాట్లాడుతూ, అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు అయ్యేలా క్షేత్రస్థాయిలో విస్తృతంగా పనిచేయాలని సూచించారు. పట్టభద్రుల ఓటు హక్కు ప్రజాస్వామ్య బలోపేతానికి ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా అధికారులు, మండల, డివిజన్ అధ్యక్షులు, వివిధ మోర్చాల నాయకులు మరియు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

– ఇర్సడ్ల వంశీకృష్ణ,పవర్ దినపత్రిక, డిస్ట్రిక్ట్ స్టాఫ్ ప్రతినిధి

## పర్యాటక శాఖ పోటీలలో ఘన విజయం సాధించిన ఆత్మకూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు

(ఆత్మకూర్ -- పవర్ దినపత్రిక, అక్టోబర్ 01, 2026)

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి వివిధ పోటీలలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఆత్మకూర్ -- హనుమకొండ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి బహుమతులు సాధించి కళాశాలకు గర్వకారణంగా నిలిచారు. ఈ పోటీలలో ఎంపీసీ ప్రథమ సంవత్సరం విద్యార్థి పి. రాఘవ షార్ట్ ఫిల్మ్ విభాగంలో ద్వితీయ బహుమతి సాధించారు. అలాగే ఎంపీసీ ద్వితీయ సంవత్సరం విద్యార్థినులు ఎం.డి. షమీమా వ్యాసరచన పోటీలో, సంబరి జ్యోత్స్న డ్రాయింగ్ పోటీలో తృతీయ బహుమతులు కైవసం చేసుకున్నారు.

ఈ సందర్భంగా విజేతలైన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డి. కవిత మరియు అధ్యాపకులు ఘనంగా అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు. విద్యార్థులను పోటీలకు సిద్ధం చేయడంలో తెలుగు అధ్యాపకులు వర్దం కరుణాకర్ రెడ్డి మరియు గణిత అధ్యాపకులు బండి రాజు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. విద్యార్థులను దగ్గరుండి పోటీ ప్రాంగణానికి తీసుకెళ్లి, అవసరమైన మార్గదర్శకత్వం మరియు సహకారం అందించిన వారి కృషిని ప్రిన్సిపాల్ అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డి. కవిత మాట్లాడుతూ, ఈ విజయాల స్ఫూర్తితో కళాశాలలోని విద్యార్థులందరూ



చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సృజనాత్మకత మరియు ఇతర రంగాలలోనూ రాణించాలని ఆకాంక్షించారు. తమలోని నైపుణ్యాలను వెలికితీసి, పట్టుదలతో ముందుకు సాగి ఉన్నత లక్ష్యాలను సాధించాలని, తల్లిదండ్రులకు మరియు కళాశాలకు మంచి పేరు తెచ్చి బంగారు భవిష్యత్తును నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల విజయానికి ప్రోత్సాహం అందించిన ప్రిన్సిపాల్, అధ్యాపకులకు మరియు విజేత విద్యార్థులకు కళాశాల సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

## నక్కలగుట్టలో గిఫ్ట్ గార్డెన్ ప్రారంభించిన విష్ణు రెడ్డి

(హనుమకొండ -- పవర్ దినపత్రిక, అక్టోబర్ 01, 2026)





వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని నక్కలగుట్టలో నూతనంగా ఏర్పాటు చేసిన గిఫ్ట్ గార్డెన్‌ను గురువారం రోజు వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అల్లుడు విష్ణు రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేసి, కస్టమర్లకు అందుబాటు ధరలలో నాణ్యమైన బహుమతులను అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు నాయిని లక్ష్మా రెడ్డి, స్థానిక డివిజన్ అధ్యక్షులు కరీం, నాయకులు కొండా నాగరాజు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి భరోసా

(స్టేషన్ ఘన్‌పూర్ -- పవర్ దినపత్రిక, అక్టోబర్ 01, 2026)

కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే ఇందిరమ్మ రాజ్యం అని, ఇందిరమ్మ రాజ్యంలో ఇందిరానగర్‌లో ఒక్క గుడిసె కూడా ఉండటానికి వీలులేదని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్పష్టం చేశారు. స్టేషన్ ఘన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డు ఇందిరానగర్‌లో రూ.5 లక్షలతో నిర్మించిన వంట గది మరియు మున్సిపల్ నిధులు కోటి రూపాయలతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లు, సైడ్ డ్రెయిన్ ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.



ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ, తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత ఇందిరానగర్‌కు పలుమార్లు వచ్చానని, స్థానికుల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటున్నానని చెప్పారు. గతంలో ఇందిరానగర్ మధ్యలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు తన దృష్టికి తీసుకురాగానే, వెంటనే దానిని అక్కడి నుంచి తరలించినట్లు తెలిపారు. ఇందిరానగర్‌లో అంతర్గత రోడ్లు, ఇతర మౌలిక వసతుల కోసం చర్యలు చేపట్టామని, ప్రస్తుతం మున్సిపాలిటీ పరిధిలో అత్యధికంగా సీసీ రోడ్లు నిర్మించిన ప్రాంతాల్లో ఇందిరానగర్ కూడా ఒకటిగా ఉందని పేర్కొన్నారు. సీసీ రోడ్లతో పాటు సైడ్ డ్రెయిన్ నిర్మాణం పూర్తయిందని తెలిపారు.

ఇందిరానగర్‌లో ఎక్కువగా పేద కుటుంబాలు నివసిస్తున్నందున అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు. గతంలో ఏడు ఇళ్లు మంజూరు కాగా ఐదు ఇళ్ల నిర్మాణం పూర్తయిందని, మిగిలిన కుటుంబాలకు కూడా ఇళ్లు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇందిరానగర్‌లో ఇంకా గుడిసెలు లేదా కవర్లతో ఉన్న ఇళ్లు ఎన్ని ఉన్నాయో మున్సిపల్ అధికారులు సర్వే చేసి అర్హుల జాబితాను సిద్ధం చేయాలని సూచించారు. అవసరమైతే మరో 10, 15 ఇళ్లు అయినా మంజూరు చేయించుకోవడానికి తాను సిద్ధంగా ఉన్నానని, ఇందిరానగర్‌లోని అర్హులైన ప్రతి కుటుంబానికి పక్కా ఇల్లు నిర్మించే బాధ్యత తనదేనని మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి భరోసా ఇచ్చారు.

అలాగే స్టేషన్ ఘన్‌పూర్ మున్సిపాలిటీలో ఎక్కడ లేని విధంగా ఇందిరానగర్‌లో సీసీ రోడ్ల నిర్మాణం చేసుకున్నామని, 10 మరియు 18వ వార్డుల్లో తాగునీటి సమస్యను అతి త్వరలోనే పరిష్కరిస్తామని స్పష్టం చేశారు.

## నూతన వస్త్రధారణ వేడుకల్లో పాల్గొన్న భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి



(మొగుళ్ళపల్లి -- పవర్ దినపత్రిక, అక్టోబర్ 01, 2026)

మొగుళ్ళపల్లి మండలం రంగాపురం గ్రామ వాస్తవ్యులు రత్నం విష్ణు మరియు సుకన్య దంపతుల కుమార్తెల నూతన వస్త్ర, ఫల పుష్పాలంకరణ కార్యక్రమానికి భూపాలపల్లి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి హాజరై చిన్నారులను ఆశీర్వదించారు.

ఈ కార్యక్రమంలో వారి వెంట మండల బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# అధికారుల తీరుపై వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య ఆగ్రహం

(హనుమకొండ -- పవర్ దినపత్రిక, అక్టోబర్ 01, 2026)

అభివృద్ధి మరియు సంక్షేమ పథకాల అమలుపై సమగ్ర సమాచారంతో దిశా సమావేశానికి హాజరుకావాల్సిన అధికారులు పూర్తి వివరాలు లేకుండా రావడంపై వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. దిశా కమిటీ సమావేశానికి జిల్లా స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని, వచ్చే సమావేశానికి తమ శాఖలకు సంబంధించిన పూర్తి సమాచారంతో రావాలని స్పష్టం చేశారు.

హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో గురువారం వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అధ్యక్షతన జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ (దిశా) సమావేశం జరిగింది. ఈ సమావేశంలో స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, అదనపు కలెక్టర్ ఎన్. రవి, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ వెంకన్న, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా వ్యవసాయం, వైద్య ఆరోగ్యం, విద్య, మహిళా శిశు సంక్షేమం, రహదారులు, పురావస్తు తదితర శాఖల పరిధిలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి మరియు సంక్షేమ పథకాల పురోగతిని ఎంపీ సమీక్షించారు. పథకాల అమలులో ఎదురవుతున్న సమస్యలు, క్షేత్రస్థాయిలో పరిస్థితులు, చేపట్టాల్సిన చర్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.

కొన్ని శాఖలకు సంబంధించిన సమగ్ర సమాచారం లేకుండా అధికారులు సమావేశానికి హాజరుకావడంపై ఎంపీ అసంతృప్తి వ్యక్తం చేశారు. మీ శాఖకు సంబంధించిన పూర్తి సమాచారం లేకుండా దిశా సమావేశానికి ఎందుకు వచ్చారని అధికారులను ప్రశ్నించారు. ఇకపై సమావేశానికి వచ్చే ప్రతి అధికారి తన శాఖకు సంబంధించిన పథకాల అమలు, పురోగతి, ఖర్చులు, పెండింగ్ పనులు, సమస్యలు మరియు తదుపరి చర్యలపై పూర్తి సమాచారంతో రావాలని సూచించారు. దిశా సమావేశానికి జిల్లా స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని స్పష్టం చేశారు. జిల్లా స్థాయి ఉన్నతాధికారి హాజరుకాకుండా ఇతర అధికారులు రావడంపై కూడా ఎంపీ ఆరా తీశారు. సంబంధిత జిల్లా స్థాయి అధికారి ఎందుకు హాజరుకాలేదో లిఖితపూర్వకంగా వివరణ ఇవ్వాలని ఆదేశించారు. వచ్చే దిశా సమావేశానికి ప్రతి శాఖ అధికారులు తమ శాఖకు సంబంధించిన పూర్తి సమాచారంతో రావాలని ఎంపీ కోరారు. కేంద్ర పథకాలు ఎంతవరకు అమలవుతున్నాయి, ఎంత నిధులు వచ్చాయి, ఎంత ఖర్చు చేశారు, ఏ పనులు పూర్తయ్యాయి, ఏవి పెండింగ్‌లో ఉన్నాయి, సమస్యలు ఏమిటి మరియు వాటి పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలు ఏమిటి అనే వివరాలు స్పష్టంగా ఉండాలని పేర్కొన్నారు.






కేంద్ర పథకాల అమలు పురోగతిపై అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయాలని, కేవలం కార్యాలయాలకే పరిమితం కాకుండా పనులు జరుగుతున్న ప్రాంతాలను సందర్శించి వాస్తవ పరిస్థితులను తెలుసుకోవాలని సూచించారు.

తన ఎంపీ నిధులను వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా 90 శాతం కేటాయించినప్పటికీ ఆన్లైన్లో మాత్రం వాటి నమోదు సంఖ్యను తక్కువ చూపడం పట్ల ఎంపీ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎంపీ ఫండ్స్ ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటల సాగుతో రైతులకు కలిగే ప్రయోజనాలపై వ్యవసాయ శాఖ అధికారులు విస్తృతంగా అవగాహన కల్పించాలని ఎంపీ సూచించారు. వైద్య ఆరోగ్య శాఖపై సమీక్ష సందర్భంగా గర్భిణీల వివరాలు నూటికి నూ శాతం నమోదు చేయాలని ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మధుమేహ బాధితులకు ఇన్సులిన్ అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా బాలల పరిరక్షణకు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు సంబంధిత శాఖలు సమన్వయంతో పటిష్ట చర్యలు చేపట్టాలని ఎంపీ ఆదేశించారు. జిల్లాలో తరచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను పరిశీలించి అవసరమైన నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. వరంగల్ మ్యూజియం అభివృద్ధికి సంబంధించి సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేసి అందజేయాలని పురావస్తు శాఖ అధికారులను ఆదేశించారు. అధికారుల పనితీరుతోనే ప్రభుత్వ పథకాల ఫలితాలు ప్రజలకు చేరుతాయని ఎంపీ డాక్టర్ కడియం కావ్య పేర్కొన్నారు. అనంతరం టీబీ బాధితులకు పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ శేషాద్రి, హనుమకొండ ఆర్డీవో వెంకటేష్, జిల్లా వ్యవసాయ అధికారి విజయ్ చంద్ర, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య, జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.వి. గిరిరాజు గౌడ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# భూపాలపల్లిలో మెగా జాబ్ మేళా నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయాలి

## ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

(భూపాలపల్లి -- పవర్ దినపత్రిక,

నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా అక్టోబర్ 9న భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని పుష్ప గ్రౌండ్‌లో మెగా జాబ్ మేళా నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. గురువారం ఐడీసీవోలో జాబ్ మేళా ఏర్పాట్లపై రెవెన్యూ, పోలీస్, మున్సిపల్, పంచాయతీ రాజ్, డీఆర్డీఏ, సింగరేణి, జెన్‌కో, తదితర శాఖల అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, జాబ్ మేళాలో 300కు పైగా ప్రముఖ కంపెనీలు పాల్గొనున్నాయని, 20 వేల మంది నిరుద్యోగ యువతను సమీకరించి ఉద్యోగావకాశాలు



కల్పించడమే లక్ష్యంగా ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ముఖ్య అతిథిగా హాజరై జాబ్ మేళాను ప్రారంభించనున్నారని పేర్కొన్నారు. ఎంపీ కడియం కావ్యతో పాటు ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొంటారని వెల్లడించారు. జాబ్ మేళా నిర్వహణ సమాచారం ప్రతి గ్రామానికి చేరాలని గ్రామ, మండల, మున్సిపల్ స్థాయిలో విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. ప్రతి గ్రామంలో నిరుద్యోగ యువతను గుర్తించి జాబ్ మేళాకు వచ్చేలా చూడాలని తెలిపారు. గ్రామ, మండల, జిల్లా స్థాయిలో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసి సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. అక్టోబర్ 6 లోగా గ్రామాల వారీగా చదువుకున్న నిరుద్యోగ యువత వివరాలను సేకరించాలని స్పష్టం చేశారు. ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే నిరుద్యోగ యువతకు ఉచిత రవాణా సదుపాయం కల్పించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. జాబ్ మేళా ప్రాంగణంలో మధ్యాహ్న భోజన సౌకర్యం ఏర్పాటు చేయాలని తెలిపారు. తక్కువ వ్యవధి ఉన్నందున అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనకు చేపడుతున్న జాబ్ మేళాను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కోరారు.

# హౌజు బుజుర్గు గ్రామంలో సైబర్ నేరాలపై అవగాహన

(ఆత్మకూర్ - పవర్ , అక్టోబర్ 01)

ఆత్మకూరు మండలం లో సైబర్ నేరాలను నియంత్రించేందుకు ఆత్మకూరు పోలీసుల ఆధ్వర్యంలో హౌజ్ బుజుర్గు గ్రామం లో బుధవారం "ఫ్లాష్ వాక్" కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని హౌస్ బుజుర్గ్ గ్రామంలో సి ఐ బాబులాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆగండి ఆలోచించండి -- అడుగు వేయండి"లి అనే అంశం పై గ్రామ ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆత్మకూరు సి ఐ బాబులాల్ మాట్లాడుతూ.. తెలియని వ్యక్తులకు సెల్ ఫోన్ కు వచ్చినఓ టి పి వివరాలు వెల్లడించవద్దని, అపరిచిత లింకులను క్లిక్ చేయవద్దని, ఆన్‌లైన్ గేమ్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు. "డిజిటల్ అరెస్ట్" అనేది లేదని, ఎవరైనా డిజిటల్ అరెస్ట్ పేరుతో బెదిరిస్తే మోసపోవద్దని కోరారు. సైబర్ మోసానికి గురైన వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1930 కు కాల్ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ తిరుపతి, గ్రామ సర్పంచ్ మౌలా, కానిస్టేబుల్ ప్రవీణ్ కుమార్, సుమారు 80 మంది గ్రామస్థులు పాల్గొన్నారు



# మ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలి



## పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

(హనుమకొండ -- పవర్ దినపత్రిక, అక్టోబర్ 01, 2026)

వరంగల్ - ఖమ్మం - నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా ప్రతి నాయకుడు, కార్యకర్త క్షేత్రస్థాయిలో సమష్టిగా పనిచేయాలని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పిలుపునిచ్చారు. హనుమకొండలోని తన నివాసంలో పరకాల నియోజకవర్గానికి చెందిన పార్టీ సీనియర్ నాయకులు, యువజన నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎన్నికలపై పార్టీ శ్రేణులతో విస్తృతంగా చర్చించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పట్టభద్రులు, యువత, ఉద్యోగుల కోసం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను వివరించాలని సూచించారు. పట్టభద్ర ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రతి ఓటరును నేరుగా కలిసి మద్దతు కోరాలని దిశానిర్దేశం చేశారు. ఈ ఎన్నికలకు పరకాల నియోజకవర్గ బాధ్యుడిగా పరకాల మండల సీనియర్ నాయకుడు నేతాని శ్రీనివాస్ రెడ్డిని నియమిస్తున్నట్లు ప్రకటించారు. ప్రతి నియోజకవర్గం, గ్రామం, పట్టణంలో సమన్వయంతో పనిచేసి ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరవేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పరకాల పట్టణ, పరకాల, నడికుడ, ఆత్మకూరు, దామెర, గీసుగొండ, సంగెం మండలాల సమన్వయకర్తలు, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 15, 16, 17 డివిజన్ల నాయకులు, యువజన విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# మహాత్మా జ్యోతిరావు పూలే బాలికల విద్యాలయాన్ని సందర్శించిన భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

(రేగొండ -- పవర్ దినపత్రిక, అక్టోబర్ 01, 2026)



రేగొండ మండలం లింగాల క్రాస్ వద్ద ఉన్న మహాత్మా జ్యోతిరావు పూలే బాలికల విద్యాలయాన్ని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు మరియు ఉపాధ్యాయులతో మాట్లాడి విద్యాలయంలోని వసతులు, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం విద్యాలయంలో పరిస్థితులు బాగానే ఉన్నప్పటికీ అక్కడక్కడా కొన్ని చిన్నచిన్న లోపాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా తరగతి గదుల్లో ఫ్యాన్లు, లైట్లు మరియు సరైన వెంటిలేషన్ అందుబాటులో లేకపోవడం, చిన్నపాటి మరమ్మతులు అవసరం ఉండటం వంటి సమస్యలను గుర్తించారు. సంబంధిత అధికారులు వీటిని త్వరితగతిన పరిష్కరించి, విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

అదేవిధంగా రాష్ట్ర స్థాయిలో పదవ తరగతి మరియు ఇంటర్మీడియట్ బోర్డు పరీక్షల్లో గత సంవత్సరం మంచి ర్యాంకులు సాధించడం అభినందనీయమన్నారు. ఇక్కడ విద్యార్థినులకు మంచి విద్యను అందిస్తున్న ఉపాధ్యాయులకు, క్రమశిక్షణతో మంచి లక్ష్యంతో చదువుతున్న విద్యార్థినులకు శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులను నిరంతరం పర్యవేక్షిస్తూ, విద్యాలయంలో ప్రస్తుతం ఉన్న సౌకర్యాలను ఇదే విధంగా మెరుగ్గా నిర్వహించాలని సూచించారు.

# మృతుల కుటుంబాలను పరామర్శించి నివాళులర్పించిన పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

(వరంగల్ -- పవర్ దినపత్రిక, అక్టోబర్ 01, 2026)




గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 15వ డివిజన్ మొగిలిచెర్ల గ్రామంలో ఇటీవలే మృతిచెందిన బెజ్జాల మొగిలి, అచ్చే ఉపేంద్రల కుటుంబాలను పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. బాధిత కుటుంబాలకు అన్నివిధాలా అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వయోవద్ధుల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉంది

**భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**

(భూపాలపల్లి -- పవర్ దినపత్రిక, అక్టోబర్ 01, 2026)



వయోవద్ధుల సంక్షేమం మరియు వారి హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు స్పష్టం చేశారు. గురువారం ఐడీవోసీ కార్యాలయంలో మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ వయోవద్ధుల దినోత్సవ వేడుకలలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి ఆయన పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ వృద్ధాప్యంలో తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసే సంతానంపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. తల్లిదండ్రులను వేధిస్తూ వారి ఆస్తులను స్వాధీనం చేసుకునే వారిపై వయోవద్ధుల సంక్షేమ చట్టం ప్రకారం చర్యలు తీసుకునే అధికారం ఉందని తెలిపారు. అవసరమైతే పిల్లల పేరుకు బదిలీ చేసిన ఆస్తులను తిరిగి తల్లిదండ్రుల పేరు మీదకు మార్చే అవకాశం కూడా ఉందని వివరించారు. అర్హులైన వయోవద్ధులందరికీ సీనియర్ సిటిజన్ ఐడీ కార్డులు అందజేయడంతో పాటు నిబంధనల ప్రకారం రేషన్ కార్డులు మంజూరు చేస్తామని తెలిపారు.

వయోవద్ధులు ఆహ్లాదకరంగా సమయం గడిపేందుకు భూపాలపల్లిలోని హనుమాన్ నగర్‌లో డే కేర్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అక్కడ ఆటలు, భోజనం, టీ వంటి సదుపాయాలు కల్పించామన్నారు. శాశ్వత డే కేర్ సెంటర్ నిర్మాణం చేపడుతున్నామని, పనులు పూర్తయిన వెంటనే అందుబాటులోకి తీసుకువస్తామని వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, అదనపు ఎస్పీ నరేష్ కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ బుర్ర కొమరయ్య, సంక్షేమ అధికారి మల్లీశ్వరి, డీఎంహెచ్ఓ డాక్టర్ మధుసూదన్, డీఆర్‌డీఏ బాలకృష్ణ, వివిధ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వయోవద్ధులు తదితరులు పాల్గొన్నారు

# కాంగ్రెస్ పార్టీలోకి భారీగా చేరికలు

**ఎంపీ కడియం కావ్య సమక్షంలో పార్టీ మారిన బీఆర్ఎస్ నేతలు**

(హనుమకొండ -- పవర్ దినపత్రిక, అక్టోబర్ 01, 2026)



స్టేషన్ ఘనపూర్ మండలం అక్కపల్లిగూడెం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు యార కొమురెల్లి ఆధ్వర్యంలో సుమారు 20 మంది నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. హనుమకొండలోని కనకదుర్గ కాలనీలో ఉన్న నివాసంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య సమక్షంలో ఈ చేరికలు జరిగాయి. పార్టీలో చేరిన వారికి కడియం కావ్య కాంగ్రెస్ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

ఈ సందర్భంగా కడియం కావ్య మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీలో చేరడానికి అన్ని వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకం పేద ప్రజలకు ప్రత్యక్షంగా అందుతోందని, ఇందుకు పార్టీలోకి జరుగుతున్న భారీ చేరికలే నిదర్శనమని పేర్కొన్నారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసుకోవడంతో పాటు, అందరం కలిసికట్టుగా నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు బొమ్మగాళ్ల పెత్రు, యార్ల మహిపాల్, చిన్నోజు జీవన్, కూసరాజు, అనుముల అనిల్, అనుముల అశోక్, బొమ్మగాళ్ల అఖిల్, బొమ్మగాళ్ల సురేష్‌తో పాటు పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# దిశా కమిటీ చైర్‌పర్సన్, ఎంపీ డాక్టర్ కడియం కావ్య అధ్యక్షతన ప్రారంభమైన దిశా సమావేశం

(హనుమకొండ -- పవర్ దినపత్రిక, అక్టోబర్ 01, 2026)



హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు, జిల్లా అభివృద్ధి సమన్వయ మరియు పర్యవేక్షణ కమిటీ (దిశా) చైర్‌పర్సన్ డాక్టర్ కడియం కావ్య అధ్యక్షతన దిశా కమిటీ సమావేశం ప్రారంభమైంది.

ఈ సమావేశానికి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, కేఆర్ నాగరాజు, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌తో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. సమావేశంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో అమలవుతున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి పథకాల పురోగతిపై సమీక్ష నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా విద్య, వైద్యం, వ్యవసాయం, తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు, సాగునీరు తదితర రంగాల్లో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల అమలు తీరును శాఖల వారీగా చర్చిస్తున్నారు.

## ప్రజా సేవలో చెరగని ముద్ర వేసిన మాదాసి ఎర్ర సాంబయ్య: ఘనంగా మూడో వర్ధంతి

(ఆత్మకూరు -- పవర్ దినపత్రిక, అక్టోబర్ 01, 2026)



నాగయ్యపల్లి గ్రామ మొదటి ఉప సర్పంచ్‌గా మాదాసి ఎర్ర సాంబయ్య గ్రామ అభివృద్ధికి ఎనలేని కృషి చేసి ప్రజా సేవలో చెరగని ముద్ర వేశారని మాజీ ఉప సర్పంచ్, బీఆర్ఎస్ పార్టీ నాయకుడు పోగుల సుకునాకర్, కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు జినుక అశోక్, గ్రామ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గిన్నారపు భాస్కర్, దళిత బహుజన ఫ్రంట్ జిల్లా కార్యదర్శి మాదాసి సుదర్శన్, ధర్మసమాజ్ పార్టీ మండల అధ్యక్షుడు బాగాజీ కొనియాడారు. ప్రజా సంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ మాదాసి సురేష్ తండ్రి అయిన మాదాసి ఎర్ర సాంబయ్య కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడిగా, గ్రామ మొదటి ఉపసర్పంచ్‌గా పనిచేసి గ్రామంలో దళితులకు, పేదలకు ప్రభుత్వ గృహాలు నిర్మించి ప్రజానాయకుడిగా గుర్తింపు పొందారు. గురువారం ఎర్ర సాంబయ్య మూడో వర్ధంతి సందర్భంగా పార్టీలకతీతంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పరకాల ప్రాంతానికి మాజీ మంత్రులు మాదాటి నర్సింహా రెడ్డి, కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్యే సిరికొండ మధుసూదనాచారి, మంద ఐలయ్య, మాజీ ఎంపీ జంగారెడ్డి తదితర ప్రముఖులు, నాయకుల సహకారంతో, ప్రజల భాగస్వామ్యంతో గ్రామాభివృద్ధిలో కీలక పాత్ర పోషించారని, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేశారని గుర్తు చేశారు. నేటి యువత మాదాసి ఎర్ర సాంబయ్యను ఆదర్శంగా తీసుకుని ఆయన ఆశయాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీబీఎఫ్ గ్రామ అధ్యక్షుడు మాదాసి నవీన్, మాజీ బీజేపీ గ్రామ అధ్యక్షుడు కొన్నే రాజు, డీఎస్పీ మండల నాయకుడు డాక్టర్ సుధాకర్, ఎమ్మార్పీఎస్ మండల నాయకుడు మాదాసి ప్రభాకర్, మాజీ వార్డు సభ్యులు మాదాసి అశోక్, బోడోళ్ళ సాంబయ్య, నాయకులు మాదాసి రాజు, మైకు స్వామి, మాదాసి బిక్షపతి, మాదాసి చిలుకయ్య, గిన్నారపు ప్రమీల, సంగి సుజాత, గిన్నారపు చిలుక, గిన్నారపు రాధ, మాదాసి చిన్న కట్టమ్మ, మాదాసి సునితతో పాటు మాదాసి ఎర్ర సాంబయ్య కుమారుడు మాదాసి సురేష్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## చిన్నారి జెస్సిక మరియు సంజన నూతన వస్త్రధారణ వేడుకల్లో పాల్గొన్న పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

(సంగెం -- పవర్ దినపత్రిక, అక్టోబర్ 01, 2026)





సంగెం మండలం నల్లకుంట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు చాతాల అనూష, నరేష్ దంపతుల కుమార్తె జెస్సిక నూతన వస్త్రధారణ, ఫల పుష్పాలంకరణ వేడుక ఘనంగా జరిగింది. ఈ వేడుకలో పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పాల్గొని చిన్నారి జెస్సికను ఆశీర్వదించారు. అలాగే గీసుగొండ మండలం శాయంపేట గ్రామంలో సముద్రాల రమ, సతీష్ దంపతుల కుమార్తె సంజన నూతన వస్త్రధారణ, ఫల పుష్పాలంకరణ వేడుకలో చల్లా ధర్మారెడ్డి పాల్గొని చిన్నారి సంజనను ఆశీర్వదించారు. చిన్నారి ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షించారు.

ఈ వేడుకల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## వరదన్నపేటలో ఎర్రబెల్లి వరద రాజేశ్వరరావును పరామర్శించిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

**డాక్టర్ కుందూరు వెంకటరెడ్డి మృతికి సంతాపం తెలిపిన ఎమ్మెల్యే**

(వర్ధన్నపేట -- పవర్ దినపత్రిక, అక్టోబర్ 01, 2026)





వరంగల్ మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ భర్త, సీనియర్ రాజకీయ నాయకులు ఎర్రబెల్లి వరద రాజేశ్వరరావు ఇటీవల అనారోగ్యంతో హాస్పిటల్‌లో చికిత్స పొందిన అనంతరం ఇంటికి చేరుకున్నారు. ఈ క్రమంలో ఆయనను వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వరద రాజేశ్వరరావు ఆరోగ్యం గురించి కుటుంబ సభ్యులను కూడా అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే నాగరాజు, త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆరోగ్య విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ?అలాగే సుబేదారి ఆఫీసర్స్ క్లబ్ సభ్యులు, తనతో పాటు టెన్నిస్ ఆడే మిత్రుడు డాక్టర్ కుందూరు వెంకటరెడ్డి మృతి తీవ్రంగా బాధ కలిగించిందని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. డాక్టర్ కుందూరు వెంకటరెడ్డి మృతదేహాన్ని గురువారం వారి నివాసానికి వెళ్లి సందర్శించిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## బాధిత కుటుంబాలను పరామర్శించిన వర్ధన్నపేట నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు అరూరి రమేష్

( వర్ధన్నపేట-- పవర్ దినపత్రిక, అక్టోబర్ 01, 2026)



వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని ఐనవోలు మండలం ముల్కలగూడెం గ్రామానికి చెందిన గ్రామ శాఖ మాజీ అధ్యక్షులు భీమిరెడ్డి గోవర్ధన్ రెడ్డి ప్రమాదవశాత్తు కాలులో సగభాగం కోల్పోయిన విషయం తెలుసుకున్న వర్ధన్నపేట నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు అరూరి రమేష్ ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని మనోధైర్యం కల్పించారు.

అలాగే ఆకారపు చెన్నమల్లు సతీమణి సవిత ఇటీవల మరణించగా, వారి నివాసానికి వెళ్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

అనంతరం ఐనవోలు దేవస్థాన మాజీ డైరెక్టర్ కుసుంబ దేవేందర్ తల్లి అమృతమ్మ ఇటీవల మరణించగా వారి నివాసానికి వెళ్లి చిత్రపటానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు.

అదేవిధంగా పత్తి నరేష్ సోదరుడు సురేష్ ఇటీవల మరణించగా, వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.



# సిల్క్ లుక్‌లో మమితా బైజు

- సంప్రదాయ దుస్తుల్లో మెరిసిన ప్రేమలు బ్యూటీ
- సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన ఫొటోలు



మలయాళీ ముద్దుగుమ్మ మమితా బైజు తన క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్, సహజమైన నటనతో యూత్‌లో మంచి ఫాలోయింగ్ సంపాదించుకుంది. 'ప్రేమలు' సినిమాతో ఒక్కసారిగా టాలీవుడ్, కోలీవుడ్ సహా పలు సినీ పరిశ్రమల్లో క్రేజ్ తెచ్చుకుంది. సోషల్ మీడియాలో ఆమె చేసే ప్రతి పోస్ట్ అభిమానులను ఆకట్టుకుంటోంది. తాజాగా 'విస్పర్స్ ఆఫ్ సిల్క్ అండ్ లైట్' అంటూ మమితా బైజు షేర్ చేసిన ఫొటోలు వైరల్‌గా మారాయి. సంప్రదాయ సిల్క్ దుస్తుల్లో క్యూట్ స్మైల్‌తో మెరిసిన ఆమె లుక్‌కు నెటిజన్లు ఫిదా అవుతున్నారు. డిజైనర్ దీప్తి రూపొందించిన దుస్తులను ధరించిన మమితాకు అర్చన అఖిల్ రావు స్టైలింగ్ చేశారు. కర్ణిక జ్యువెల్స్ ఆభరణాలు, ఫొటోగ్రాఫర్ విష్ణు కెమెరా పనితనం ఈ ఫొటోషూట్‌కు మరింత ప్రత్యేకతను తీసుకొచ్చాయి. ట్రెడిషన్ ప్లస్ అందం అంటూ అభిమానులు ప్రశంసలు కురిపిస్తున్నారు.

# జైలర్‌తో మనోహరి

## సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన 'బిందాస్'



సూపర్‌స్టార్ రజనీకాంత్ హీరోగా నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'జైలర్ 2' నుంచి 'బిందాస్' పాట తాజాగా విడుదలైంది. సన్ పిక్చర్స్ బ్యానర్‌పై రూపొందుతున్న ఈ చిత్రంలో బాలీవుడ్ గ్లామర్ బ్యూటీ నోరా ఫతేహి ప్రత్యేక నృత్యంతో అలరించింది. 'జైలర్'లో తమన్నా 'కావాలా' పాటకు వచ్చిన క్రేజ్ మాదిరిగానే.. 'బిందాస్'లో నోరా స్టెప్పులు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి.

గోల్డెన్ కలర్ కాస్ట్యూమ్‌లో నోరా వేసిన మాస్ స్టెప్పులు ఆకట్టుకుంటున్నాయి. అయితే పాటపై సంగీత ప్రియుల నుంచి మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. అనిరుధ్ రవిచందర్ అందించిన బాణీ రొటీన్‌గా ఉందని కొందరు నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. నోరా గ్లామర్, డ్యాన్స్‌తో పాటకు ప్రత్యేక ఆకర్షణ తీసుకొచ్చినా.. మ్యూజిక్, లిరిక్స్ విషయంలో మరింత కొత్తదనం ఉంటే బాగుండేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# ఎర్రటి గౌన్‌లో మెరిసిన అవ్‌నీత్ కౌర్

**సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన ఫొటోలు**



సోషల్ మీడియా సంచలనం, నటి అవ్‌నీత్ కౌర్ మరోసారి తన ఫ్యాషన్ లుక్‌తో అభిమానులను ఆకట్టుకున్నారు. ప్రస్తుతం లండన్‌లో ఉన్న ఆమె.. ఎప్పటికప్పుడు కొత్త ఫ్యాషన్ ట్రెండ్స్‌ను పరిచయం చేస్తూ యువత దృష్టిని ఆకర్షిస్తున్నారు. తాజాగా ఆమె షేర్ చేసిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. 'రెడ్ కార్పెట్ రెడీ' అంటూ అవ్‌నీత్ కౌర్ షేర్ చేసిన ఈ ఫొటోల్లో అద్భుతమైన డిజైన్‌తో కూడిన ఎర్రటి గౌన్‌లో మెరిశారు. ప్రముఖ ఫొటోగ్రాఫర్ రోహిత్ యూకే కెమెరాలో బంధించిన ఈ చిత్రాల్లో ఆమె గ్లామరస్ లుక్‌తో ఆకట్టుకున్నారు. ఫొటోలు చూసిన అభిమానులు 'లాల్ పారీ', 'రెడ్ వెల్వెట్ గర్ల్' అంటూ కామెంట్లు చేస్తూ ప్రశంసలు కురిపిస్తున్నారు.

సినిమా డెస్క్ ఆంధ్రప్రభ:





# పెళ్లి కూతురు కన్య కాదు

- పెళ్లి క్యాన్సిల్
- కొత్త కాన్సెప్ట్‌తో టాలీవుడ్ మూవీ 'ఇంప్యూర్'

టాలీవుడ్‌లో సున్నితమైన సామాజిక అంశాలను కొత్త కథాంశాలతో తెరపైకి తీసుకొస్తున్న యువ దర్శకులు, నిర్మాతల నేపథ్యంలో 'ఇంప్యూర్' చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. పెళ్లి పీటలపై కూర్చోబోయే వధువు కన్య కాదని అత్తమామలకు తెలియడంతో పెళ్లిని రద్దు చేసే అంశం చుట్టూ ఈ సినిమా కథ సాగుతుంది. కాకినాడలో పుట్టి అమెరికాలో పెరిగిన వారాహి మల్లిపాముల ఈ చిత్రంతో నటిగా, రచయిత్రిగా, నిర్మాతగా పరిచయం అవుతున్నారు. న్యూయార్క్, లాస్ ఏంజిల్స్‌లో టెక్ రంగంలో పనిచేస్తూనే రాత్రుళ్లు, వారాంతాల్లో కథ రాసుకుని సినిమాను రూపొందించినట్లు తెలిపారు. మహిళా ప్రాధాన్య కథకు నిర్మాతలు ముందుకు రాకపోవడంతో స్వయంగా నిర్మాణ బాధ్యతలు చేపట్టినట్లు చెప్పారు. సమంత, నందినీ రెడ్డి కాంబినేషన్‌లో వచ్చిన 'మా ఇంటి బంగారం' వంటి మహిళా ప్రాధాన్య చిత్రాలకు ప్రేక్షకుల ఆదరణ తనకు స్ఫూర్తినిచ్చిందని వారాహి తెలిపారు. కుటుంబం నుంచి ఆర్థిక సహకారం తీసుకోవడంతో పాటు అప్పులు చేసి ఈ చిత్రాన్ని పూర్తి చేసినట్లు వెల్లడించారు. ప్రస్తుతం చిత్రాన్ని స్వయంగా పంపిణీ చేసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిపారు.

# స్టైలిష్ లుక్‌లో మెరిసిన టాలీవుడ్ బ్యూటీ

- సముద్రం మధ్యలో వెకేషన్ ఎంజాయ్ చేస్తున్న నభా నటేష్
- వైరల్‌గా మారిన లేటెస్ట్ ఫొటోలు



టాలీవుడ్ ట్రెండీ బ్యూటీ నభా నటేష్ సోషల్ మీడియాలో తన స్టైలిష్ ఫొటోలతో అభిమానులను ఆకట్టుకుంటోంది. తాజాగా సముద్రం మధ్యలోని ప్రశాంతమైన ప్రదేశం నుంచి ఆమె షేర్ చేసిన వెకేషన్ ఫొటోలు నెట్టింట వైరల్‌గా మారాయి. 'సముద్రం మధ్యలో ఉన్న చిన్న భూభాగంపై!' అంటూ నభా పెట్టిన క్యాప్షన్ కూడా ఆకట్టుకుంటోంది. తాటాకులతో కూడిన విల్లా, సముద్రపు అలల నేపథ్యంలో నభా స్టైలిష్ బ్రౌన్ బ్యాండేయు టాప్, టెక్చర్డ్ హైవెయిస్ట్ లెగ్గింగ్స్‌లో మెరిసింది. సూర్యకాంతి నుంచి కళ్లను కాపాడుకుంటూ ఆమె ఇచ్చిన పోజులు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. ఫొటోలు చూసిన నెటిజన్లు 'ప్రెట్టీ', 'పీక్ బ్యూటీ', 'స్వీట్ హార్ట్' అంటూ కామెంట్లు చేస్తున్నారు. క్షణాల్లో వైరల్‌గా మారిన ఈ ఫొటోలు నభా నటేష్ గ్లామర్ క్రేజ్‌కు మరోసారి నిదర్శనంగా నిలిచాయి.



# రూటు మార్చిన అనుపమ..

**లేడీ ఓరియంటెడ్ కథలపై ఫోకస్**

మలయాళ ప్రేమమ్‌తో సినీ రంగ ప్రవేశం చేసిన అనుపమ పరమేశ్వరన్ దక్షిణాది భాషల్లో హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకుంది. పదేళ్ల సినీ ప్రయాణంలో పలు విజయాలు, పరాజయాలు చూసిన ఆమె ప్రస్తుతం సినిమాల ఎంపికలో కొత్త దారిని ఎంచుకుంటోంది. ఓ వైపు స్టార్ హీరోల సరసన నటిస్తూనే మరోవైపు లేడీ ఓరియంటెడ్ చిత్రాలకు ప్రాధాన్యం ఇస్తోంది. అయితే ఆమె హీరోయిన్ ఓరియంటెడ్ చిత్రాల్లో చాలా వరకు ఆశించిన స్థాయిలో విజయాలు సాధించకపోయినా వరుసగా అలాంటి కథలకు ఓకే చెబుతుండటంపై చర్చ జరుగుతోంది. తాజాగా అనుపమ నటించిన 'క్రేజీ కళ్యాణం' విడుదలకు సిద్ధమవుతోంది. పెళ్లి విషయంలో తండ్రితో విభేదించే యువతి పాత్రలో ఆమె కనిపించనుంది. ఈ చిత్రంతోనైనా అనుపమకు మంచి విజయం దక్కుతుందేమో చూడాలి.